## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఆదిభట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మరియపురం ఫీడర్‌పై ఉన్న విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. మరియపురం పరిసర ప్రాంత గృహ, వాణిజ్య, వినియోగదారులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా పంపిణీ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### సమస్యలు పరిష్కరించండి

**డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ధర్నా**

అబ్దుల్లాపూర్‌మెట్: 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీతో పాటు 2004 వరకూ విధుల్లో ఉన్న ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని (ఈపీఎఫ్ టూ జీపీఎఫ్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు డివిజన్ కార్యాలయం ఎదుట భోజన విశ్రాంతి సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ విధానాలను అమలు చేయాలని, విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పర్సనల్ పే ను సర్వీస్‌పేలో కలిపిన తర్వాతనే పే ఫిక్సేషన్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ యాదగిరి, ఐకాస చైర్మన్ సత్యనారాయణ, ఏడీఈ సైదులు, 1104 ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు విక్రాంత్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

### రేపు ఉచిత వినికిడి శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెంలో గల యూనికార్పస్ వర్డ్ అండ్ డీడ్ హాస్పిటల్ మరియు యూనికార్పస్ పునరావాస కేంద్రంలో చెవి మరియు వినికిడి సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లల కోసం ఆదివారం ఉచిత సహాయ శిబిరాన్ని నిర్వహించనున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోత్స్న తెలిపారు. 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు శిబిరంలో సంప్రదించవచ్చన్నారు. చెవి, వినికిడి సమస్యలు ఉన్నవారికి వినికిడి పరికరాలు సాహి (సొసైటీ టు అయిడ్ ద హియరింగ్ ఇంపైర్డ్) సంస్థ సహకారంతో ఉచితంగా అందజేస్తామని పేర్కొన్న ఆమె యూనికార్పస్ వర్డ్ అండ్ డీడ్ ఆస్పత్రిలో పిల్లలకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యం

**దళిత్ శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్**



మంచాల చేరుకున్న స్వరాజ పాదయాత్ర

మంచాల: తెలంగాణ భవిష్యత్ రాజకీయాల్లో అగ్రకుల పార్టీల జెండాలకి అభిముఖంగా ఒక్క డీఎస్పీ (దళిత్ శక్తి ప్రోగ్రాం) జెండా మాత్రమే నిలబడబోతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, చాంద్‌ఖాన్‌గూడ, ఆస్మత్‌పూర్, జాపాల గ్రామాలకు మీదుగా కొనసాగిన స్వరాజ పాదయాత్ర పది వేల కిలోమీటర్ల మైలురాయి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో విశారదన్ మహరాజ్ డీఎస్పీ జెండాలను ఆవిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తామన్నారు. పాదయాత్ర ఇన్‌చార్జి లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, మంచాల మండల కన్వీనర్ ఆనంద్, కోకన్వీనర్లు ప్రదీప్, శ్రావణ్, వినోద్, రమేష్, కిషన్, వంశీ పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి ఆదరణ

ఆమనగల్లు: మాడ్గుల మండలం కలకొండ గ్రామంలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు డా.అఖిల్ ప్రారంభించారు. శిబిరంలో కామినేని ఆస్పత్రి వైద్యులు అఖిల్, రోహిణి, యశ్వంత్, విష్ణు, సరిత, నవ్య 245 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కల్వకొండ గ్రామ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ లాలమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నర్సంపల్లి సర్పంచ్ హన్మానాయక్, స్థానిక నాయకులు బిక్కు, మహేశ్, శ్రీశైలం, చరణ్, రాజుతదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గరుడ వాహన సేవ

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కల్కిదోనగుట్ట గోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గరుడ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. గోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహన రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ ముఖ్య కార్యనిర్వాహక సభ్యులు సిద్దాంతి కృష్ణమూర్తి శర్మ పాల్గొన్నారు.

# పేదల నడ్డి విరుస్తున్నారు



హయత్‌నగర్: తొర్రూర్‌లో బీఆర్ఎస్ నేతల ఆందోళన



యాచారం: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

గ్యాస్ ధరల పెంపుపై బీఆర్ఎస్ పార్టీ సహా ఇతర పార్టీలు భగ్గుమన్నాయి. శుక్రవారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ వివిధ పార్టీల నాయకులు, ప్రజలు నిరసన తెలిపారు. ప్రధాన రోడ్లు, కూడళ్లలో గ్యాస్ సిలిండర్లకు పూలమాల వేసి నిరసన తెలిపారు. కట్టెలపొయ్యితో రోడ్లపై వంటావార్పు చేశారు. 2014లో రూ.400 ఉన్న వంటగ్యాస్ ధర నేడు రూ.1150 దాటిందన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ బడాబాబులకు కొమ్ము కాస్తూ పేదల నడ్డివిరుస్తోందన్నారు. పలుచోట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీకి తగిన బుద్ధి చెబుతామన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నేతలు



అబ్దుల్లాపూర్‌మెట్: ప్లకార్డులతో నిరసన తెలుపున్న గులాబీ శ్రేణులు



కడ్తాల్: గ్యాస్ సిలిండర్లకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



కడ్తాల్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మంచాల: ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అభివృద్ధి చేశామనే ప్రజల్లోకి ..

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

హయత్‌నగర్: ఎనిమిదేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ఇంకా ప్రజల అవసరాలు తెలుసుకుని కావల్సిన పనులు చేసేందుకే ప్రగతి నివేదన పాదయాత్రతో గడపగడపకు వస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి తొర్రూర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం వెనుకబడిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిందని తెలిపారు. మంచినీటి అందించేందుకు రూ:146 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు తొర్రూర్ ప్రజల కు సంక్షేమ పథకాల ద్వారా రూ:80 కోట్లు అందాయని, ఇక్కడి దళితులకు ఇంటికి కోటి రూపాయలు వరకు ప్రయోజనం కలిగే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

విధంగా పరిహారం ఇప్పించామన్నారు. ఈ ప్రాంతంలోకి పండ్ల మార్కెట్ రావడం వల్ల ఎంతో మంది యువతకు ఉపాధి కలుగుతోందని తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పక్కరాష్ట్రాల్లో ఉన్న ప్రజలు తామెందుకు తెలంగాణాలో లేము అని బాధ పడుతున్నారని తెలిపారు. ఫార్మాసిటీతో నాలుగేళ్లలో ప్రతి ఇక్కడి ఒక్కరికి ఉపాధి దొరుకుతోందన్నారు. రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా చక్కని వేషధారణతో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్‌గా భానుప్రకాశ్, కరెస్పాండెంట్‌గా చందన, కలెక్టర్‌గా లహరి, ఆర్‌జేడీగా చరణ్‌తేజ వ్యవహరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆమనగల్లు సీఐ ఉపేందర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ చైర్మన్ అల్లాజీగౌడ్, అకాడమిక్ అడ్వయిజర్ సుదర్శన్‌రెడ్డి, కరెస్పాండెంట్ సుజాత, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపాల్ శ్రీశైలం, ఉపాధ్యాయులు మల్లేశ్, యాదయ్య, చలం, శ్రీరాం, రాము, రేవతి, రమాదేవి తదితరులు ఉన్నారు.

**వెంకట్రావ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో..**

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన



ఆమనగల్లు: ఉపాధ్యాయులతో విద్యార్థులు

దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కలెక్టర్‌గా భానుప్రసాద్, డీఈఓగా సంజయ్, ఎంఈఓగా హాసిని, హెచ్‌ఎంగా సుమాంజలి వ్యవహరించారు. చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు హైమావతి, సాయిబాబా, రవికుమార్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం పన్నులు వసూలు చేయండి



బిల్‌కలెక్టర్లకు పీఓఎస్ మెషీన్లను అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి
- బిల్ కలెక్టర్లకు పీఓఎస్ యంత్రాల అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఇంటితో పాటు వాణిజ్య సముదాయాల్లో మార్చి నెలాఖరు వరకు 100 శాతం పన్ను వసూలు చేయటమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం 2022–23 ముగింపు నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, పన్నుల వసూళ్ల కోసం ఏర్పాటుచేసిన టీం సభ్యులు మరియు పర్యవేక్షణాధికారులతో ఆమన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 8మంది బిల్ కలెక్టర్లతో 8 బృందాలుగా విభజించి ప్రతి బృందానికి మొండి బకాయిలున్న 100మంది జాబితాను అందజేసి పన్నుల వసూళ్ల బాధ్యతను ఆయా బృందాలకు అప్పగించారు. ఈ బృందాలను పర్యవేక్షించేందుకు డీఈఈ అశోక్ కుమార్, మేనేజర్ నాగేంద్రబాబు, టీపీఓ శైలజను నియమించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో మొండి బకాయిదారులను 47మందిని గుర్తించామని వారికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీచేశామని అయినా స్పందించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా ఉండేందుకు గాను నూతనంగా క్రెడిట్, డెబిట్, గూగుల్‌పే, ఫోన్‌పేల ద్వారా సులువుగా నగదు చెల్లించేందుకు వీలుగా బిల్‌కలెక్టర్లకు పీఓఎస్ (హ్యాండ్ హెల్డ్) మెషీన్లను చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి చేతుల మీదుగా అందజేశారు.

**యాచారం మండలంలో..**

యాచారం: ఇంటి పన్నుల వసూళ్లల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటి పన్నుల వసూళ్లు, ఉపాధి పనుల వేగవంతం, నర్సరీల్లో మొక్కల పెంపకం, గ్రామాల్లో పారిశుద్ధ్యం, క్రీడా ప్రాంగాణాల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మార్చి 30 లోపు 24 గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి ఉమాదేవి ఈజీఎస్ ఈసీ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్కులను హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు అశోక్ రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, సుదర్శన్ రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మంచాల మండలంలో..**

మంచాల: మండలంలోని లోయపల్లి గ్రామానికి చెందిన దోసపాటి బాలమణికి రూ.36వేలు, నగరంలోని కృష్ణానగర్ చెందిన రాజేష్‌కు రూ.60 వేల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి ఆ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి రామ్‌రెడ్డి, సమ్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, బాబు గౌడ్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నర్సింహ



నర్సింహ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



బీక్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి

కడ్తాల్: ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కడ్తాల్ మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన యాట నర్సింహ నియమితులైనట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కానుగుబావితండాకు చెందిన నేనావత్ బీక్యానాయక్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దీంతోపాటు కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొండ్రిగాన్‌బోడ్‌తండాకు చెందిన సభావట్ బీచ్యానాయక్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా పడకల్ గ్రామానికి చెందిన డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా చీపునుంతల గ్రామానికి చెందిన మహేశ్ నియమితులైనట్లు తెలిపారు.

### చెన్నకేశవరెడ్డిని గెలిపిద్దాం: పీఆర్టీయూ

ఆమనగల్లు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆమనగల్లులోని పలు పాఠశాలల్లో శుక్రవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు వెంకట్రాంరెడ్డి, కడ్తాల పీఆర్టీయూ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఆమనగల్లు మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి చందర్, నాయకులు వేణుగోపల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొంగరలో ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ

- పదేళ్లలో పది లక్షల మందికి ఉపాధి
- ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని.. అందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థకు చెందిన ప్రాజెక్ట్ ఇబ్రహీంపట్నం రానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ల చొరవ, ముందు చూపుతో రాష్ట్రానికి ప్రముఖ కంపెనీలు వస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద సంస్థ ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీ కొంగరకలాన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 200 ఎకరాల భూమిని ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలించారని.. అక్కడే ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ఓఆర్ఆర్, ఫ్యాబ్‌సిటితోపాటు నగరానికి సమీపంలో కొంగరకలాన్ ఉండటంతో కంపెనీ ఏర్పాటుకు సంస్థ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని మొదటి రెండేళ్లల్లో సుమారు లక్ష మందికి, పదేండ్లలో పదిలక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు రాములు, రైతు బంధు మెంబర్ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**కొంగరలో బైక్ ర్యాలీ..**

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌కు ఎలక్ట్రానిక్ దిగ్గజం ఫాక్స్‌కాన్ కంపెనీ రావడం చాలా సంతోషంగా ఉందని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల కొంగరకలాన్‌తో పాటు ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి కొంగరకలాన్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య, కౌన్సిలర్లు శ్రీనివాస్, మహేందర్, నగేష్, నారాయణ, రవీందర్, మధు, ప్రవీన్, తిరుమల్‌రెడ్డి, కృష్ణరాజు, శ్రీనివాస్, భగీరథ, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

**బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి**

హయత్‌నగర్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని బీఆర్ఎస్ యువ నేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్‌లో కొనసాగింది. గడపగడపకు తిరిగి బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం



తొర్రూర్‌లో పాదయాత్ర చేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

హయాంలో నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుని మరింతగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతు సమన్వయకర్త లక్ష్మారెడ్డి, ప్రభువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ఫిల్టర్ ఇసుక తయారీ

- వాగులు, పొలాల నుంచి మట్టి సేకరణ
- ఫిల్టర్లతో కృత్రిమ ఇసుక తయారీ
- పరిసర గ్రామాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



కొనాపురం సమీపంలో టిప్పర్‌లో కృత్రిమ ఇసుక తరలింపు

కడ్తాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కృత్రిమ(ఫిల్టర్) ఇసుక దందా జోరుగా సాగుతోంది. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. నిత్యం ట్రాక్టర్ల కొద్దీ ఇసుక రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా మండల పరిధిలోని ముద్వీన్, మర్రిపల్లి గ్రామాల సమీపంలోని వాగుల (ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయినవి) నుంచి జోరుగా మట్టిని తవ్వి దానిని ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుకగా తయారు చేసి విక్రయిస్తున్నారు. అధికారులు, పోలీసులు పలు మార్లు దాడులు చేసి, కేసులు నమోదు చేసినా ఇసుక వ్యాపారుల తీరు మారడంలేదు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వాగు సమీపంలో నుంచి, చుట్టుపక్కల వ్యవసాయ పొలాల నుంచి జేసీబీలతో మట్టిని తరలించి ఫిల్టర్ల సహాయంతో ఇసుకగా తయారు చేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా.. కడ్తాల్, ఆమనగల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాల వల్ల కాల్వలు, వాగులు, వ్యవసాయ పొలాలు ధ్వంసం కావడంతో పాటు వాటి ఉనికిని కోల్పోయే ప్రమాదముందని పలువురు వాపోతున్నారు.

**ఎలా తయారుచేస్తున్నారంటే..**

ఫిల్టర్ ఇసుక తయారీకి ముందుగానే వ్యవసాయ పొలాల్లో, వాగు సమీపంలో ట్యాంకు నిర్మాణం చేపట్టి పైభాగంలో జాలి అమర్చి.. మట్టిని ట్యాంకుపై పోసి, వాటర్ ప్రెషర్ ద్వారా కడగడంతో మట్టి బయటకు వెళ్లి, ఇసుక రేణువులు ట్యాంకులో మిగిలిపోతాయి. ప్రభుత్వం వ్యవసాయ పొలాలకు అందించే మీటర్ల ద్వారా కరెంట్ వైర్లు లాగి మోటార్లను ఏర్పాటు చేసుకుని ఇసుక దందా కొనసాగిస్తున్నారు. రెండు, మూడు ట్రాక్టర్‌ల మట్టితో ఒక ట్రాక్టర్ ఇసుక తయారు చేస్తున్నారు.

**రూ.5వేలకు ట్రాక్టర్ ఇసుక..**

అలా తయారుచేసిన ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కడ్తాల్ మండలంలో ప్రధానంగా ముద్వీన్, మర్రిపల్లి వాగు సమీపంలో జోరుగు కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. కృత్రిమ ఇసుక తయారీతో నిర్మాణాలు చేపట్టినా నాణ్యతగా ఉండవని వెంటనే ఇలాంటి ఇసుక తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**



అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు, కాల్వలు, వాగులు, చెరువుల నుంచి మట్టిని తవ్వి కృత్రిమ ఇసుక తయారు చేయడం నేరం. గతంలో రెవెన్యూ, పోలీసులు అధికారులు పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం, వాహనాలు సీజ్ చేయడం జరిగింది. నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంతోపాటు తయారీ కేంద్రాల్లోని జేసీబీలు, ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. తయారీ కేంద్రాలపై సమాచారం అందించాలి.

– మురళీకృష్ణ, తహసీల్దార్, కడ్తాల్